162) మాళవి

ప॥ ఇందుకు జింతించనేల యీశ్వరునిమాయ లివి। యెందుకు మూలము హరి యీతని జింతించరే॥

చ॥ అల నారికడపుగాయకు నీరు వచ్చినయట్టు। తలచి రాగలమేలు తన్ను దానే వచ్చురే।
లలి నేనుగుదిన్న వెలగవంటిబేసము-। వలెనే పోగలవెల్ల వడి దానే పోవురే॥

చ॥ నిండినయద్దములోన నీడ వొడచూపినట్టు। దండియైనపుట్టుగులు తన్ను దానే వచ్చురే।
పండినపండ్లు తొడమబాసి వూడినయట్టు। అండనే మరణములు అందరికి సరిరే।

చ॥ పెనురాతిపై గడవపెట్టగా గుదురైనట్టు। తనుదానే చింతింప దలపు నిలుచురే।
ఘనుడు శ్రీవేంకటేశు గని శరణన్న జాలు। వెనక పాపాలు మంచు విచ్చినట్టు విచ్చురే॥